25 సీట్లు అడగాల్సిందే!

డీపీఐలో చర్చ ● రాష్ట్రవ్యాప్తంగా సర్వేలు



తిరుమా

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమితోనే ఉంటామంటూ డీపీఐ అధినేత తిరుమావళవన్ ప్రకటించినా.. ఆ పార్టీలో మాత్రం ఇంకేదో జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎంకేని ఇరకాటంలో పెట్టే దిశగా రానున్న శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీకి కనీసం 25 సీట్లు అడగాలని ఆ పార్టీ నేతలు భావిస్తుండడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. అంతేగాక రాష్ట్రవ్యాప్తంగా డీపీఐ గెలిచేందుకు ఎక్కువ అవకాశాలున్న ప్రాంతాలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వేలను కూడా జరుపుతున్నారు. ఈ సారి 200 సీట్లలో డీఎంకే కూటమి గెలుస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఇదివరకే ప్రకటించి, ఆ దిశగా పార్టీలో ఎన్నికల సమన్వయ కమిటీని అసెంబ్లీ ఎన్నికలకు 15 నెలలకు ముందుగానే ఏర్పాటు చేసుకున్నారు. 234 శాసనసభ నియోజకవర్గాలకు పార్టీ పర్యవేక్షకులను కూడా నియమించారు. డీఎంకే బాటలోనే డీపీఐ కూడా నియోజకవర్గాల వారీగా పార్టీ పర్యవేక్షకులు, ఇన్‌చార్జుల సంఖ్యను పెంచేందుకు చర్యలు ప్రారంభించింది. డీపీఐకి ప్రస్తుతం 144 మంది జిల్లా కార్యదర్శులున్నారు. ఈ సంఖ్యను 234కి పెంచేందుకు తిరుమావళవన్ నిర్ణయించారు. త్వరలో 90 మంది జిల్లా కార్యదర్శులను నియమించనున్నారు. డీఎంకే, అన్నాడీఎంకేల తర్వాత డీపీఐని అతి పెద్ద పార్టీగా మార్చేందుకు తిరుమా పావులు కదుపుతున్నారు. అదే సమయంలో కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేని ఇరకాటంలో పెట్టేలా మద్య వ్యతిరేక మహానాడు, మహిళా మహానాడు నిర్వహించారు. ఈ రెండు సభలకూ పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో డీపీఐ నేతల్లో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. ఆ ఉత్సాహంతోనే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సర్వేలు జరిపి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఎలాగైనా 25 సీట్లు పొందాలని తిరుమా పట్టుదలతో ఉన్నారు. ఈ విషయమై డీపీఐ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 15 సీట్లు కోసం పట్టుబడితే, డీఎంకే అధిష్ఠానం నాగపట్టినం, తిరుప్పోరూరు, వానూరు, కాట్టుమన్నార్ కోవిల్, సెయ్యూరు, అరక్కోణం నియోజకవర్గాలనే కేటాయించిందని తెలిపారు. అరక్కోణం మినహా తక్కిన ఐదు నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలిచిందని చెప్పారు. ఈసారి డీపీఐ తరఫున పోటీ చేసేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ఆసక్తి కనబరుస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కనీసం 25 సీట్లయినా కేటాయించమంటూ డీఎంకే అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకు వస్తామని పేర్కొన్నారు.





సమావేశ మందిరంలోకి వస్తున్న విజయ్ - వేదికపై ఓటీఏ అధికారులతో విజయ్, హెచ్.వినోద్

సైనికులతో హీరో విజయ్

● కరచాలనం కోసం పోటాపోటీ

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అగ్రహీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఆకస్మికంగా భారత సైనికులతో సమావేశమయ్యారు. స్థానిక సెయింట్ థామస్ మౌంట్‌లో ఉన్న ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ)లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట తన 69వ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న హెచ్.వినోద్ కూడా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆర్మీ ఉన్నతాధికారులు, సైనికుల కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. విజయ్ నటించే 69వ చిత్రం షూటింగ్ ఓటీఏలో జరుగుతోంది. ఆ సమయంలో ఓటీఏలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని ఆర్మీ ఉన్నతాధికారులు విజయ్‌ను కోరగా, ఆయన వెంటనే సమ్మతించి పాల్గొన్నారు. సాధారణంగా విజయ్ పాల్గొనే ఏ కార్యక్రమమైనా పార్టీ శ్రేణులకు ముందుగానే సమాచారం చేరవేయడం ఆనవాయితీ. కానీ, ఈ కార్యక్రమానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లీక్ చేయలేదు. పైగా పార్టీ నేతలు లేదా కార్యకర్తలు ఎవరూ పాల్గొనలేదు. ఆర్మీ ఆఫీసర్స్ నిర్వహించిన కార్యక్రమం కావడంతో విజయ్, దర్శకుడు వినోద్ మాత్రమే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కు ఓటీఏలో శిక్షణ పొందుతున్న భారత సైనికులు ఘనస్వాగతం పలికారు. ఇందులో ఆర్మీ ఉన్నతాధికారులు, సైనికుల కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. వీరంతా విజయ్‌తో కరచాలనం చేసేందుకు, ఫోటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఓటీఏ ఉన్నతాధికారులు సన్మానించి, బహుమతిని ప్రదానం చేశారు. ఇదిలావుండగా, 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం విజయ్ ఇప్పటి నుంచే సమాయత్తమవుతున్న విషయం తెల్సిందే. ఈ ఎన్నికల కోసం పార్టీని బలోపేతం చేసేందుకు, పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు వీలుగా ఆయన త్వరలోనే రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు.

విరుదునగర్‌లో సీఎం స్టాలిన్

● బాణసంచా కర్మాగారంలో ఆకస్మిక తనిఖీ



బాణసంచా కర్మాగారంలో పనిచేస్తున్న మహిళా కార్మికులను పలకరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం విరుదునగర్‌కు వెళ్ళిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. జిల్లాల వారీ క్షేత్ర పరిశీలనలో భాగంగా ఆయన విరుదునగర్ జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులపై అధికారులతో సమావేశమై సమీక్షించనున్నారు. ఆ జిల్లాలో క్షేత్రపరిశీలన కోసం శనివారం ఉదయం ఆయన 11.30 గంటలకు చెన్నై నుంచి విమానంలో బయలుదేరి మదురై చేరుకున్నారు. మదురై విమానాశ్రయం వద్ద మంత్రులు ఐ.పెరియసామి, ఈవీ వేలు, మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, సాత్తూర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, జిల్లా కలెక్టర్ సంగీత, మేయర్ ఇంద్రాణి, డీఎంకే జిల్లా శాఖ నాయకులు కే.దళపతి, సేడపట్టి మణిమారన్ సహా కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కారులో బయలుదేరిన స్టాలిన్‌కు విరుదునగర్ జిల్లా సరిహద్దు వద్ద సుమారు 75 వేల మంది రహదారికి ఇరువైపులా నిలిచి స్వాగతం పలికారు. రహదారికి ఇరువైపులా జనం గుమికూడి ఉండటంతో స్టాలిన్ ఉత్సాహం చెందిన తాను ప్రయాణిస్తున్న వ్యాన్ నుంచి దిగి రోడ్డుపై నడుస్తూ అందరివైపు చేతులు ఊపుతూ, పలకరిస్తూ వెళ్లారు. వందల సంఖ్యలో మహిళలు ఆయనకు శాలువలు అందజేసి సత్కరించారు. స్థానిక ప్రజల స్వాగత సత్కారాలు ముగిసిన తర్వాత ఆయన ఆర్‌ఆర్ నగర్‌కు చేరుకున్నారు.

టపాకాయల ఫ్యాక్టరీ తనిఖీ... : ఆర్‌ఆర్ నగర్ సమీపం కన్నిచేరిపుదూరు, మేల్‌చిన్నయాపురంలో మదన్ ఫైర్ వర్క్స్ పేరుతో నడుపుతున్న బాణసంచా కర్మాగారాన్ని స్టాలిన్ ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఆ బాణసంచా కర్మాగారం లైసెన్స్ దస్తావేజులను పరిశీలించారు. ఆ తర్వాత ఫ్యాక్టరీలో రసాయనాలు భద్రపరిచే గోదాము, టపాకాయల తయారు చేసే గదులు, మైక్రోకార్డ్ వస్తువులు భద్రపరిచే గది తదితరాలను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆ ఫ్యాక్టరీలో మొత్తం 80 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 36 మంది మహిళలు ఉన్నారు. స్టాలిన్ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆ ఫ్యాక్టరీలో ఇప్పటివరకూ ఎలాంటి ప్రమాదాలు జరగలేదని, అగ్నిప్రమాదాలకు తావులేని విధంగా నిప్పునార్పే పటిష్ఠ వ్యవస్థను కలిగి ఉందని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ నిర్వాహకులను ప్రశంసించారు. ఆ ఫ్యాక్టరీ నిర్వాహకులతో స్టాలిన్ మాట్లాడుతూ... కార్మికులకు జీవిత బీమా సదుపాయం కూడా కల్పించాలని ఆదేశించారు. ఆ ఫ్యాక్టరీలో తనిఖీ పూర్తి చేసుకుని వెలుపలికు వచ్చిన స్టాలిన్‌ను వేలాదిమంది ప్రజలు చుట్టుముట్టారు. ఆ సందర్భంగా పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అదే సమయంలో స్టాలిన్ వారితో కబుర్లాడుతూ కలైంజర్ మహిళా సాధికారిక నగదు (రూ.1000) ప్రతినెలా సక్రమంగా అందుతోందా అని మహిళలను ప్రశ్నించారు. చాలామంది మహిళలు ఆ నగదు సక్రమంగా అందుతోందని బదులిచ్చారు. అటుపిమ్మట స్థానిక మహిళలు, వృద్ధురాళ్లు ఆయనతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా తొక్కిసలాట జరిగింది. వెంటనే భద్రతా విభాగం పోలీసులు వారిని కట్టడి చేశారు. ఈ కార్యక్రమాలను ముగించుకుని ఆర్‌ఆర్ నగర్‌లోని రామ్కో గెస్ట్ హౌస్‌లో ఆయన విశ్రాంతి తీసుకున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. సాయంత్రం విరుదునగర్ కొత్త బస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి ఓపెన్‌టాప్ వాహనంలో బయలుదేరి ఎంజీఆర్ విగ్రహం కూడలి, రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతం, అల్లంపట్టి ముక్కరోడ్డు మీదుగా రామ్మూర్తి హైవే దాకా రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షో ముగిసిన తర్వాత ఎస్ఎస్‌కే సరస్వతి గ్రాండ్ మండపంలో పార్టీ నాయకుల సమావేశంలో స్టాలిన్ పాల్గొన్నారు.



బాణసంచా కర్మాగారం చుట్టూ ఉన్న పచ్చదనాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న స్టాలిన్

కోవై రైలులో మత్తుమాత్రల స్వాధీనం

● ఏడుగురి అరెస్టు

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం నుంచి కోయంబత్తూరుకు వచ్చిన హిస్సార్ ఎక్స్‌ప్రెస్‌లో 7800 మత్తు మాత్రలను కోవై నగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఏడుగురు ఉత్తరాది యువకులను అరెస్టు చేశారు. కోవై నగరంలో మత్తుమాత్రలు, గంజాయి విక్రయాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ ఆదేశం మేరకు ప్రత్యేక బృందం పోలీసులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే రైలు ప్రయాణికులపై నిఘా సారించింది. ఈ క్రమంలో ఇటీవల కోవైలో శరణ్‌రాజ్, మహ్మద్ హసన్, అజిత్ కుమార్, కేశవన్, దినేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని నకిలీ మెడికల్ ప్రిస్క్రిప్షన్‌తో మందుల షాపుల్లో ఈ మత్తుమాత్రలు కొనుగోలు చేసి, రైళ్లలోని ఏసీ బోగీల్లో పనిచేసే తాత్కాలిక సిబ్బంది ద్వారా కోవైకు తరలిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం రాజస్థాన్ నుంచి కోవైకు వచ్చిన హిస్సార్ ఎక్స్‌ప్రెస్‌లోని ఓ ఏసీ బోగీలో 7800 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మాత్రలను ఏసీ బోగీలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది సికిందర్ సాయంతో రాజస్థాన్‌కు చెందిన బాబురామ్ తీసుకొచ్చాడు. దీంతో వీరిద్దరిని ప్రత్యేక బృందం పోలీసులు అరెస్టు చేసింది. వీరందరిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

136 కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురి అరెస్టు

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పల్లిఅగ్రహారం కూడలూరు రోడ్డులో ఒకే నెంబరుతో ఉన్న రెండు కార్లలో తరలిస్తున్న 136 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని మదురైకు చెందిన రవిచంద్రన్, సుబ్రమణి, పుదుక్కోటకు చెందిన ఫెర్నాండో, అయ్యప్పన్‌గా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి స్మగ్లింగ్ చేస్తున్నట్టు విచారణలో వెల్లడించారు. వీరి నుంచి ఒకే రిజిస్ట్రేషన్ నెంబరుతో కూడిన రెండు కార్లు, 5 మొబైల్ ఫోన్లు, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, ఆంధ్రలో గంజాయి కొనుగోలు చేసిన వ్యాపారుల వివరాల కోసం విచారణ జరుపుతున్నారు.

వేళచ్చేరిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

● మంత్రి సుబ్రమణ్యం





కొత్త చెరువులో ప్రవహిస్తున్న జలాలు - వేళచ్చేరి ఎంఆర్‌టీఎస్ సమీపంలోని రైల్వే రోడ్డు వద్ద వరదలను నిరోధించేందుకు తవ్విన చెరువు పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణ్యం

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరద బాధిత వేళచ్చేరి ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) సంయుక్తంగా వరద నిరోధక పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఉదయం అడయార్ జోన్ వేళచ్చేరి ఎంఆర్‌టీఎస్ సమీపంలోని రైల్వేరోడ్ నార్త్ ప్రాంతంలో వరద నిరోధక చర్యల్లో భాగంగా తవ్వుతున్న చెరువు పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆర్. ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, తిరువిక నగర్ శాసనసభ్యుడు తాయగం కవి, కౌన్సిలర్లు వి. ఆనందం, పి. మణిమారన్, ఎస్. భాస్కరన్, కమిషనర్ జే.కుమారగురుబరన్ తదితరులు పర్యటించారు. ఇటీవల రుతుపవనాల ప్రారంభంలో రెడ్‌హిల్స్, చోళవరం, ఆవడి ప్రాంతాల్లో 25 సెం.మీ. వర్షం కురిసినా గంటలోగా రహదారులు, పల్లపు ప్రాంతాల్లో చేరిన వర్షపునీరు సులువుగా తొలగిపోయిందని, దీనికి వాననీటి కాల్వల మరమ్మతులు తరచూ జరపడమేనని చెప్పారు. ప్రస్తుతం వేళచ్చేరిలో వరద బాధిత ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించి, సమస్యను శాశ్వతంగా నిరోధించేందుకు ఆ ప్రాంతాలకు చేరువగా చెరువులు తవ్వుతున్నట్లు తెలిపారు. గిండి రేస్‌కోర్స్ మైదానంలోనే నాలుగు పెద్ద చెరువులు తవ్వుతున్నామని ఆయన చెప్పారు. ఈ పనులన్నీ పూర్తయితే వేళచ్చేరి ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మారడం తథ్యమని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

నేత్రపర్వం

శ్రీవారి పుష్పయాగం



ఛత్రాన్ని, పవిత్ర కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న టీటీడీ ఏఈఓ పార్థసారథి, నూతలపాటి శ్రీకృష్ణ, మాజీ సభ్యులు



శ్రీవారికి పుష్పార్చన



హాజరైన భక్తులు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకట నారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ సమాచార కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం పుష్పయాగం నేత్రపర్వంగా సాగింది. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉదయం 9 గంటలకు హోమం, 11 గంటలకు తిరుమంజనం పూజలను ఆలయ అర్చకులు ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. శ్రీవారి భక్తులు కానుకగా సమర్పించిన సుమారు 1,000 కిలోల పువ్వులతో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన పుష్పార్చన సాయంత్రం 6 గంటల వరకు వైభవోపేతంగా జరిగింది. మల్లి, జాజి, దవనం, కనకాంబరం, సంపంగి, చామంతి, మనోరంజితం, కలువ, గులాబీలు, మగిలం, మొగిలి, తులసి తదితర పూలతో ఉభయదేవేరుల సమేత అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీవారికి లోక కల్యాణార్థం పుష్పయాగం నిర్వహించారు. ముందురోజైన శుక్రవారం నిర్వహించిన అంకురార్పణ కార్యక్రమంలో విష్వక్సేన పూజ, యాగశాల పూజలు నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా ఆలయాన్ని పూలు, పత్రాలు, అరటి, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. హాజరైన అశేష భక్తజనం మధ్య టీటీడీ ఏఈఓ కె.పార్థసారథి పర్యవేక్షణలో జరిగిన పుష్పయాగంలో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది, పాలక మండలి మాజీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీకృష్ణ, మాజీ సభ్యులు పాల్గొని శ్రీవారిని సేవించారు.

సమాచార దర్శిని

కళాశాలల్లో సహాయక కేంద్రాలు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలు, ఫిర్యాదులను పరిష్కరించడానికి సహాయ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి గోపాల్ విద్యాసంస్థలకు పంపిన సర్క్యులర్‌లో... విద్యా సంస్థల ప్రాంగణంలోని మొదటి అంతస్తులో 'సహాయ కేంద్రం' అనే బోర్డుతో సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేలా అన్ని శాఖలను అనుసంధానం చేసే 'ఇంటర్‌కమ్' వసతి కల్పించి, పనివేళల్లో ఈ కేంద్రం తెరచి ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా సమస్యలు తెలిపేలా వసతి కల్పించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను, ఫిర్యాదులను సత్వరం రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి చేరవేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 13 విశ్వవిద్యాలయాలు, 10 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, 52 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, 164 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు, ఏడు విద్యా కళాశాలల్లో ఈ సహాయ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

ప్రభుత్వ బస్సుల్లో 570.86 కోట్ల మంది ఉచిత ప్రయాణం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'మగళిర్ విడియల్ పయన' పథకంలో 570.86 కోట్ల సార్లు ప్రభుత్వ సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రభుత్వ సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే ఫైలుపై సంతకం చేశారు. ఈ పథకం పట్ల మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ప్రస్తుతం రోజుకు సరాసరి 57 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తూ, నెలకు రూ.541 నుంచి రూ.1,283 వరకు పొదుపు చేసుకుంటున్నారని ప్రభుత్వం తెలిపింది.

'నెట్' సిలబస్‌లో ఆయుర్వేద జీవశాస్త్ర పాఠం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నెట్'కు సంబంధించిన పాఠ్యాంశాల్లో కొత్తగా ఆయుర్వేద జీవశాస్త్రం పాఠం చేర్చినట్లు యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ తెలిపింది. జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో 'నెట్'ను యేటా జూన్, డిసెంబరు మాసాల్లో నిర్వహిస్తుంటారు. ఈ పరీక్షలకు సంబంధించిన పాఠ్యాంశంలో తమిళం, చరిత్ర, సైన్స్ సహా 100కు పైగా పాఠాలు ఉంటాయి. తాజాగా, ఆయుర్వేద జీవశాస్త్రం పాఠ్యాంశం చేర్చినట్టు అధికారులు తెలిపారు. డిసెంబరులో నిర్వహించే పరీక్షలో ఈ పాఠానికి సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని యూజీసీ కార్యదర్శి మనీస్ ఆర్.జోషి పేర్కొన్నారు.

25లోగా కళాశాల అధ్యాపకుల బదిలీ కౌన్సెలింగ్

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కళాశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న విద్యా సంస్థల అధ్యాపకుల బదిలీ కౌన్సెలింగ్ ఈనెల 25వ తేదిలోపు పూర్తి చేయనున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లల్లో పనిచేస్తున్న అధ్యాపకులు జనరల్ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సూచనలతో బదిలీ కౌన్సెలింగ్ ఈ నెల 25వ తేదిలోపు ఆన్‌లైన్‌లో పూర్తి చేస్తామన్నారు. బదిలీ కోరే అధ్యాపకులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, నిబంధనలకు మేరకు కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

గ్రూప్-2 పోస్టుల సంఖ్య పెంపు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 2ఏ పోస్టుల సంఖ్య పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 విభాగంలో 507 పోస్టులు, గ్రూప్-2ఏ విభాగంలో 1820 పోస్టుల భర్తీకి సెప్టెంబరు 14వ తేది ప్రిలిమినరీ నిర్వహించారు. ఈ పరీక్షకు 7.93 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 5.81 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. టీఎన్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఈ పోస్టులకు అదనంగా 213 పోస్టులు చేర్చారు. దీంతో, మొత్తం భర్తీకానున్న పోస్టుల సంఖ్య 2,540కి పెరిగింది. ప్రిమిలినరీ పరీక్షా ఫలితాలు డిసెంబరులో విడుదల కానున్నాయని, ఉత్తీర్ణులైన వారికి మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

విద్యుత్ సమస్యల ఫిర్యాదుకు వాట్సాప్ నెంబర్లు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు తెలిపేలా మండలాల వారీగా వాట్సాప్ నెంబర్లను విద్యుత్ బోర్డు విడుదల చేసింది. ఈ మేరకు విల్లుపురం, కడలూరు, తిరువణ్ణామలై జిల్లాల వినియోగదారులు 9445855768, సేలం, ఈరోడ్, నామక్కల్ జిల్లాల వినియోగదారులు 9445851912, చెన్నై జిల్లావాసులు 9445850829, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాల వాసులు 8903331912, కోవై, తిరుప్పూర్, నీలగిరి జిల్లా వినియోగదారులు 9442111912, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్ జిల్లాల వారు 9444371912, మదురై, దిండుగల్, తేని, రామనాథపురం, శివగంగ జిల్లా ప్రజలు 9443111912, తిరుచ్చి, తంజావూరు, పెరంబలూరు, అరియలూరు, పుదుకోట, తిరువారూరు, నాగపట్టణం, కరూర్ జిల్లాల వినియోగదారులు 9486111912 అనే వాట్సాప్ నెంబర్లకు తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

విద్యుత్ సిబ్బందికి ప్రాథమిక చికిత్సలపై అవగాహన

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బోర్డు సిబ్బందికి అగ్నిప్రమాదాలను అడ్డుకోవడం, ప్రాథమిక చికిత్సలపై అవగాహన అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకాలంలో ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మరమ్మతులు చేపట్టిన కార్మికులు ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై మరణిస్తుంటారు. అలాగే, విద్యుత్ సాధనాలు, ఉప విద్యుత్ కేంద్రాల్లో లో, హై ఓల్టేజీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు పేలి మంటలు చెలరేగుతుంటాయి. ఇలాంటి అగ్నిప్రమాదాలు అడ్డుకొనేలా చేపట్టాల్సిన చర్యలు, విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి అందించాల్సిన ప్రాథమిక చికిత్సలపై విద్యుత్ సిబ్బందికి అగ్నిమాపక శాఖ శిక్షణ ఇస్తోంది ఆ ప్రకారం, నీలగిరి జిల్లా గూడలూరు ఉప విద్యుత్ కేంద్రంలో శుక్రవారం నిర్వహణ ఇంజనీర్ ముత్తుకుమార్ పర్యవేక్షణలో కూడలూరు అగ్నిమాపక కేంద్రం అధికారి మార్టిన్ ప్రాథమిక చికిత్సలపై అవగాహన కల్పించారు.



ప్రాథమిక చికిత్సా విధానాన్ని చేసి చూపుతున్న అగ్నిమాపక కేంద్రం అధికారి మార్టిన్

రూ.3లక్షలు పలికిన వేల్‌మురుగన్ తిరుకల్యాణ టెంకాయ



టెంకాయను వేలం వేస్తున్న ఆలయ పూజారి

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడినాయకనూరు బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్కంద షష్ఠి వేడుకల ముగింపు సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవంలో వినియోగించిన కొబ్బరికాయను ఓ భక్తుడు రూ.3లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. సుమారు 350 యేళ్లనాటి ఆలయంలో యేటా స్కంద షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. గురువారం సాయంత్రం శూరసంహార వేడుకలు, శుక్రవారం రాత్రి తిరుకల్యాణోత్సవం జరిగాయి. శుక్రవారం రాత్రి మురుగప్పెరుమాన్ - దేవసేన కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఉపయోగించిన కొబ్బరికాయను ఆలయ ప్రధాన అర్చకులు వేలం వేశారు. ఈ సందర్భంగా రంగనాథపురానికి చెందిన ఓ భక్తుడు రూ.3లక్షలకు టెంకాయను దక్కించుకున్నాడు. రూ.6వేలతో ప్రారంభమైన వేలం పోటీ పెరగటంతో రూ.3లక్షల దాకా సాగింది. గత యేడాది టెంకాయను రూ.65 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ యేడాది వేలం ప్రారంభమైనప్పటి నుంచే పోటీ పెరిగింది.

దేహదానానికి సీపీఎం కార్యకర్తల అంగీకారం



ఓమందూర్ ఆస్పత్రి నిర్వాహకులకు అంగీకారపత్రాలు అందిస్తున్న సీపీఎం కౌన్సిలర్ జయరామన్

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన తర్వాత తమ దేహాలను పరిశోధనలకు అందించేందుకు సీపీఎం కార్యాకర్తలు అంగీకారం తెలిపారు. నవంబరు విప్లవ దినోత్సవం సందర్భంగా సీపీఎం కొళత్తూర్ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జీసీసీ సీపీఎం కౌన్సిలర్ జయరామన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో, 36 మంది పార్టీ సభ్యులు మృతి చెందిన అనంతరం తమ దేహాలను ప్రభుత్వాసుపత్రికి అప్పగించేలా అంగీకార పత్రాలపై సంతకం చేశారు. ఈ పత్రాలను ఓమందూర్ ప్రభుత్వాసుపత్రి నిర్వాహకులకు కౌన్సిలర్ జయరామన్ నేతృత్వంలో ప్రాంతీయ కార్యదర్శి బి.హేమావతి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎస్.భాగ్యలక్ష్మి, చంద్రన్, జ్యోతి, కోటేశ్వరన్, విశ్వనాధన్ బృందం అందజేసింది.

టి.నగర్ - కోడంబాక్కం మధ్య సొరంగ మార్గం పనులు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ - కోడంబాక్కం మధ్య ఆధునిక యంత్రాలతో చేపట్టిన సొరంగ మార్గం పనులు నాలుగు నెలల్లో పూర్తవుతాయని చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) అధికారులు తెలిపారు. నగరంలో ప్రస్తుతం రెండు మార్గాల్లో మెట్రోరైలు మార్గం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఉత్తర చెన్నైలోని వింకోనగర్ నుంచి దక్షిణ చెన్నైలో ఉన్న విమానాశ్రయం వరకు ఒక మార్గం, సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి కోయంబేడు మీదుగా సెయింట్ థామస్ మౌంట్ వరకు మరో రైలు మార్గంలో నడుపుతున్న రైళ్లకు ప్రజాదరణ పెరిగింది. ప్రస్తుతం రోజుకు 3 లక్షల మందికి పైగా ఈ మార్గాల్లో ప్రయాణిస్తున్నారు. ఇందువల్ల మెట్రోరైలు పథకాన్ని విస్తరింపజేయాల్సిన ఆవశ్యకతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసేలా ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో భాగంగా రూ.63,246 కోట్లతో మాధవరం నుంచి సిప్కాట్ వరకు, మాధవరం నుంచి షోళింగనల్లూర్, పూందమల్లి నుంచి కోడంబాక్కం, టినగర్ మీదుగా లైట్ హౌస్ వరకు మెట్రోరైలు పథకం విజయవంతంగా సాగుతోంది.టినగర్ - కోడంబాక్కం మధ్య సొరంగ మార్గం తవ్వకాల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పెలికాన్, పీకాక్ అనే ఆధునిక యంత్రాల ద్వారా చేపట్టిన ఈ పనులు మరో నాలుగు నెలల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భూమి కింద పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయని, ఇలాంటి ప్రాంతాల్లో తవ్వకాలు జరపడం సవాలుగా ఉందన్నారు. అలాగే, ఆస్పత్రులు, వంతెనలు, రైలు పట్టాలున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలతో పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

డీఎస్పీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దురై మురుగన్

వేలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టులో రూ.20 లక్షలతో నిర్మించిన డీఎస్పీ కార్యాలయ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, ఎస్పీ మదివానన్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనంతో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యాలయ పరిధిలో 23 పోలీస్‌స్టేషన్లు, 3 మహిళా పోలీస్‌స్టేషన్లు, 4 ట్రాఫిక్ కంట్రోల్ పోలీస్‌స్టేషన్లు, 2 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు పని చేయనున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యే నందకుమార్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, ఆనైకట్టు డీఎస్పీ సారథి, వేలూరు సబ్ కలెక్టర్ బాలసుబ్రమణ్యం, ఆనైకట్టు తహసీల్దార్ వేండా తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విజయానికి ప్రధాని మోదీ కారణం

● కిసాన్ మోర్చా నేత నాగరాజ్



పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రంప్ విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ కారణమని బీజేపీ అనుబంధ రైతు సంఘం కిసాన్ మోర్చా అధ్యక్షుడు జీకే నాగరాజ్ తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ చారిత్రాత్మక విజయం సాధించడానికి అమెరికాలో నివసిస్తున్న భారతీయుల ఆదరించడం ఒక కారణమన్నారు. అయినప్పటికీ, ఆయన ప్రధాని మోదీ స్నేహితుడిగా ఉంటూ జాతీయత అనే విధానం అంగీకరించి, అమలుచేయడం కూడా కారణమన్నారు. ప్రపంచంలోనే అద్వితీయ శక్తిగా ఉన్న దేశాధ్యక్షుడిని నిర్ణయించే శక్తి భారతదేశానికి కలిగి ఉండడం ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమన్నారు. కానీ, రాష్ట్రంలో మాత్రం ప్రధాని మోదీపై ద్వేషం పెంచేలా సంకుచిత రాజకీయాలు చేస్తూ ద్రావిడ మోడల్ డీఎంకే ప్రభుత్వం ప్రజల మధ్య ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవ పరిస్థితులు తెలుసుకొని బీజేపీని ఆదరించే కాలం త్వరలో వస్తుందని ఆయన తెలిపారు.

ఆస్పత్రుల ప్రచార ప్రకటనలను నిషేధించలేం

● హైకోర్టు స్పష్టీకరణ

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల్లో ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు చేస్తున్న ప్రచారంపై ఎలాంటి నిషేధం విధించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా చేస్తున్న ప్రచారంపై నిషేధం విధించాలని కోరుతూ మంగైయర్‌కరసి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్, న్యాయమూర్తి సెంథిల్ కుమార్ రామ్మూర్తిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన ధర్మాసనం.. ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు ఇచ్చే యాడ్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రచురించడం లేదా ప్రసారం చేయడం అనేది సాధ్యం కాదని, తప్పు చేసే ఆస్పత్రులు, వైద్యులపై మెడికల్ కమిషన్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అందువల్ల ఈ ప్రచారాలపై నిషేధం విధించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

దక్షిణాసియా స్థాయిలో మెడ్రాస్ ఐఐటీకి 56వ స్థానం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రిటన్‌కు చెందిన 'క్యూఎస్' యూనివర్శిటీ దక్షిణాసియా స్థాయిలో ఉత్తమ విద్యా సంస్థల జాబితా విడుదల చేసింది. ఆ జాబితాలో భారత్, శ్రీలంక, పాకిస్తాన్ సహా పలు దేశాలకు చెందిన 984 ఉన్నత విద్యాసంస్థలు చోటుచేసుకున్నాయి. ఈ జాబితాలో చైనాకు చెందిన 'పేకింగ్' యూనివర్శిటీ 100కు 100 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే, ఈ జాబితాలో భారత్‌కు చెందిన 162 విద్యా సంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో మెడ్రాస్ ఐఐటీ 56వ స్థానం, అన్నా విశ్వవిద్యాలయం (100కు 42.5 మార్కులతో) 177వ స్థానంలో నిలిచాయి.

కొడైకెనాల్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ ఉంటే రూ.20 జరిమానా

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌ను కాలుష్యరహిత కేంద్రంగా మార్చేందుకు జిల్లా ఆరోగ్య శాఖ పలు చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ వస్తువులు తీసుకురావడంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘించి ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసుకొచ్చే పర్యాటకులకు రూ.20 జరిమానా విధించనున్నారు. అందుకోసం ఆరోగ్యశాఖ బృందాలు పార్కులు, హోటళ్లు, విడిది గృహాల్లో తనిఖీలు చేపట్టనున్నారని జిల్లా ఆరోగ్యశాఖ తెలియజేసింది.

శరవేగంగా అద్దాల వంతెన నిర్మాణం



అద్దాల వంతెన నిర్మాణ పనులు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం కన్నియాకుమారికి వెళ్లే పర్యాటకులు సముద్రం మధ్యలో ఉన్న వివేకానంద రాక్, తిరువళ్లువర్ విగ్రహాన్ని చూసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు పూంపుహార్ సంస్థ పడవలు నడుపుతోంది. ఈ క్రమంలో, వివేకానంద రాక్ - తిరువళ్లువర్ విగ్రహానికి మధ్య పర్యాటకులు సముద్ర అందాలు వీక్షించేలా 97 మీటర్ల పొడవైన అద్దాల వంతెన నిర్మించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, రూ.37 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ వంతెన నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. తిరువళ్లువర్ విగ్రహం ఏర్పాటు చేసి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా 2025 జనవరిలో ఈ వంతెనను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు.

23న గ్రామసభలు

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23వ తేది గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఈనెల 1వ తేది గ్రామసభలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా, నిర్వహణ కారణాల రీత్యా వాయిదా వేశారు. ఈ క్రమంలో, ఈ నెల 23వ తేది అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం 11 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామసభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రచారం చేపట్టాలని, నిర్వహించే ప్రాంతాన్ని ముందుగానే తెలియజేయాలని ప్రభుత్వం పేర్కొంది.

ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయుల గైడ్ ఆవిష్కరిస్తున్న లెక్చరర్ అముద, టెక్నికల్ విద్య ఉపాధ్యాయుడు జనార్ధనన్

వేలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైన్స్ బోధనలో మెలకువలు పాటించేలా సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. స్థానిక ప్రభుత్వ ముస్లిం ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఈ శిక్షణకు జిల్లా అధ్యక్షుడు, సదస్సు ఆర్గనైజర్, లెక్చరర్ అముద అధ్యక్షత వహించగా, జిల్లా సెక్రటరీ జనార్దనన్ ఆహ్వానం పలికారు. ఈ శిక్షణలో వేలూరు శాఖ అధ్యక్షురాలు, లెక్చరర్ దేవి, సెక్రటరీ సిలుపన్, కోశాధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీ కుప్పంలో ప్రత్యేక వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేవీ కుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరం శనివారం జరిగింది. ఈ శిబిరాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. 401 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాజు, పిల్లల అభివృద్ధి పథక డైరెక్టర్ శాంతి ప్రియదర్శిని, ఆరోగ్యశాఖ ఆర్గనైజర్ ఆదిత్య, కేవీ కుప్పం కౌన్సిలర్ రవిచంద్రన్, జయ, శంకర్‌గణేష్ సహా పలువురు పాల్గొన్నారు.

12న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా

● రాష్ట్ర దౌహీత్ జమాత్ ప్రకటన

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం పేరుతో ముస్లింలకు చెందిన మసీదులు, ధార్మిక సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కుట్రపన్నుతుందంటూ ఈనెల 12న చెన్నైలో భారీ ధర్నా చేయనున్నట్టు దౌహీత్ జమాత్ తమిళనాడు శాఖ ప్రకటించింది. ఇదే విషయంపై ఆ శాఖ అధ్యక్షుడు ముజఫర్ రెహ్మాన్ శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీన స్థానిక ఎగ్మోర్‌లోని రాజారత్తినం స్టేడియం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఒకేరోజు 2,153 మంది పోలీసుల బదిలీ

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకేరోజు 2,153 మంది పోలీసులు బదిలీ అయ్యారు. బదిలీ కోరుతూ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు దరఖాస్తు చేసుకున్నారు. వారి కోరిక పరిశీలించిన ప్రభుత్వం 2,153 మంది పోలీసులను బదిలీ చేస్తూ శనివారం డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు.

గవర్నర్ పర్యటన రద్దు

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి మదురై, రామనాథపురం పర్యటనలు ఆకస్మికంగా రద్దయ్యాయి. గవర్నర్ పర్యటన ప్రకటన మేరకు శనివారం ఉదయం 10 గంటలకు ఆయన విమానంలో మదురై వెళ్ళి అక్కడి మీనాక్షి అమ్మవారిని దర్శించుకుని, అక్కడి నుంచి కారులో రామనాథపురం వెళ్ళి రాత్రి అక్కడే బస చేయాల్సి ఉంది. మరుసటి రోజు ఆయన రామేశ్వరం ఆలయంలో స్ఫటిక లింగ పూజలో పాల్గొని, అక్కడి నుంచి కారులో మదురై చేరుకుని ఎయిర్‌ఇండియా విమానంలో చెన్నైకి తిరిగి రావాల్సి ఉంది. గవర్నర్ ప్రయాణించనున్న ఆ విమానంలోనే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన రెండు రోజుల విరుదునగర్ జిల్లా పర్యటనను ముగించుకుని నగరానికి బయలుదేరాల్సి ఉంది. ఆదివారం మధ్యాహ్నం 1.50 గంటలకు మదురై నుంచి గవర్నర్, ముఖ్యమంత్రి ఒకే విమానంలో నగరానికి వస్తారని వార్తలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో గవర్నర్ పర్యటన చివరి క్షణంలో రద్దయినట్లు రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది.

ఆస్తి కోసం కన్న తల్లిపై దాడి కుమార్తె అరెస్ట్

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజీఆర్‌నగర్‌లో ఆస్తి కోసం కన్నతల్లిని రోడ్డుకీడ్చి దాడికి పాల్పడిన కుమార్తెను పోలీసులు అరెస్ట్ చేశారు. చూలపల్లం కనక సభ వీధికి చెందిన ఆదిలక్ష్మి(64), కుమార్తె త్రిలోకసుందరి ఆస్తుల వ్యవహారంలో తరచూ గొడవ పడుతుండేవారు. ఆస్తిలో తన వాటా పంచివ్వాలని త్రిలోక సుందరి పలుమార్లు తల్లిని చిత్రహింసల పాల్జేసినట్టు తెలిసింది. దీనిపై ఆదిలక్ష్మి 10 సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా త్రిలోక సుందరిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో, ఈ నెల 6వ తేది రాత్రి ఇంటి బయట కూర్చున్న ఆదిలక్ష్మి వద్దకు బైక్‌లో వచ్చిన త్రిలోకసుందరి దాడికి పాల్పడడంతో ఆమె తీవ్రగాయాలయ్యాయి. ఇరుగుపొరుగు వారు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి అందజేసిన ఫిర్యాదు మేరకు కేసుగా నమోదుచేసిన పోలీసులు, కనకసభ వీధిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. అందులో ఆదిలక్ష్మిని జుట్టు పట్టుకొని ఈడ్చి చితకబాదిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈ ఫుటేజీ ఆధారంగా పోలీసులు త్రిలోకసుందరిపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

బైకును ఢీకొని ఆమ్నీ బస్సు దగ్ధం

● ఒకరి మృతి



దగ్ధమవుతున్న ఆమ్నీ బస్సు

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా శంకగిరి సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన ఆమ్నీ బస్సులో ఉన్నట్టుండి నిప్పుమంటలు చెలరేగాయి. బస్సులోని 20 మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాసేపటికల్లా ఆ బస్సు పూర్తిగా దగ్ధమైంది. సేలం సమీపం శంకగిరలోని కోయంబత్తూరు - సేలం జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న ఆమ్నీ బస్సు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొంది. ఆ తర్వాత ఆ బస్సు రోడ్డుపై బోల్తాపడి మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బైకును నడిపిన వ్యక్తి తీవ్ర గాయాలతో దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న శంకగిరి పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశారు.

చెన్నైలో డ్రగ్స్ విక్రయం: సహాయ నటి అరెస్ట్

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో డ్రగ్స్ విక్రయించిన సినీ సహాయ నటి మీనాను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నాసాలైలో శనివారం మధ్యాహ్నం కొంతమందికి మాదకద్రవ్యాన్ని విక్రయించిన మీనాను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె నుంచి 5 గ్రాముల స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మీనా 'డాడి' అనే తమిళ చిత్రంలో, 'సుందరి' సహా పలు టీవీ సీరియళ్లలో నటించారు.

ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వేధింపులు గాయకుడి ఆత్మహత్య

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వేధింపులను భరించలేని ఓ గాయకుడు సెల్ఫీ వీడియో విడుదల చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన తెన్‌కాశి జిల్లా పావూర్‌సత్రంలో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన సహాయరాజ్ (53) 2012లో స్థానిక ఫైనాన్స్ కంపెనీలో వాహన రుణం తీసుకుని, నిర్ణీత కాలవ్యవధిలో తిరిగి చెల్లించారు. అయితే, ఇంకా రూ.30 వేల రుణం తిరిగి చెల్లించాల్సి ఉందని పేర్కొంటూ నోటీసులు పంపడంతోపాటూ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఫోన్ చేసి వేధించసాగారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన సూసైడ్ సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బోల్తా పడిన సిలిండర్ లారీ

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మణలి హైరోడ్డులో గ్యాస్ సిలిండర్ లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డాడు. దిండివనానికి చెందిన విజయ్‌శంకర్ (43) లారీ డ్రైవరు. శుక్రవారం రాత్రి అన్నాసాలై నుంచి మణలి పుదునగర్‌లోని ఓ గ్యాస్ ప్లాంట్‌కు ఖాళీ సిలిండర్ల లోడుతో లారీని తీసుకెళ్లాడు. ఈ లారీ మణలి ఎంఎఫ్ఎల్ కూడలి వద్ద నియంత్రణ కోల్పోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విజయ్ శంకర్ గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బాలికను గర్భిణిని చేసిన పూజారి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భిణిని చేసిన ఆలయ పూజారిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. ప్లస్ టూ చదువుతున్న విద్యార్థిని హఠాత్తుగా కడుపునొప్పితో తల్లడిల్లిపోయింది. దీంతో ఆమెను తల్లిదండ్రులు ఓ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఆ బాలికకు నిర్వహించిన వైద్యపరీక్షల్లో ఆమె గర్భం దాల్చినట్లు తెలిసింది. దీనిపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి విచారణ జరిపిన పోలీసులు పూజారిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

తిరువళ్లూర్‌లో 30 వానరాల పట్టివేత



బోనులో బంధించిన వానరాలు

ప్యారీస్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ పట్టణంలో కోతల బెడద అధికంగా ఉందని మున్సిపాలిటీకి అందిన ఫిర్యాదుతో, అటవీ శాఖ సిబ్బంది 30కి పైగా కోతులను బంధించి సమీపంలోని అడవుల్లో వదిలిపెట్టారు. నగరంలో ఇళ్లపై నీటి ట్యాంక్‌లను అపరిశుభ్రం చేస్తూ, పిల్లలను భయపెట్టడం, వారి చేతుల్లోని ఆహార వస్తువులు ఎత్తుకెళ్లడం వంటి ఘటనకు కోతులు పాల్పడుతున్నాయని ప్రజలు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన అటవీ శాఖ, శనివారం నగరంలో 30కి పైగా కోతులను బంధించి అడవుల్లో విడిచిపెట్టారు.

విద్యార్థులకు నీలవేము కషాయం

పెరంబూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాంబరం కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నీలవేము కషాయం పంపిణీ చేయాలని నిర్ణయించారు. కార్పొరేషన్ పరిధిలో 76 కార్పొరేషన్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 212 ప్రైవేటు పాఠశాలలు ఉన్నా యి. వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధులు అడ్డుకొనేలా కార్పొరేషన్ ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు తలా 10 నుంచి 15 మి.లీ నీలవేము కషాయాన్ని మూడు రోజులు అందజేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పేర్కొన్నారు.



వేలూరులోని ముస్లిం ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల పరీక్షల శాఖ నిర్వహించిన టెక్నికల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

SUNDAY SPECIAL


రాతి కుందెన తయారీ




వివిధ సైజుల్లో రాతి కుందెనలు

అరుదైన దీపాలతో వెలుగులు

- కోవైలో జోరందుకున్న రాతి కుందెనల ఉత్పత్తి
- జోరందుకున్న విక్రయాలు

పన్నెండున్నర అడుగుల రాతి కుందెన


చిన్న రంధ్రాలతో ఉన్న దీపాలు

దేవుడి దీపారాధన కంటే భక్తులకు సంతృప్తికరమైనదేముంది? తమకు ఇష్టమైన కుందెనలతో దీపం వెలిగించి, దేవుణ్ని మనసారా ఆరాధించడం కంటే కావాల్సింది ఏముంది? అందుకే చాలామంది తమకు ఇష్టమైన, అందుబాటులో వున్న మట్టి, ఇత్తడి, రాతి కుందెనలలో దీపాలు వెలిగించి తమ ఇష్టదైవాన్ని పూజించడం కద్దు. ఈ ఆచారం అనాదిగా వస్తున్నదే. ప్రస్తుతం మట్టి దీపాలు, వెండి, బంగారు పూతతో చేసిన లోహ కుందెనలు, కర్ర కుందెనల్ని ప్రజలు వినియోగిస్తున్నారు. అయితే చాలా ఏళ్ల క్రితం రాళ్లతో చేసిన కుందెనలలో దీపాలు వెలిగించి పూజించే ఆచారం ఉండేది. ముఖ్యంగా, ఆలయాల్లోని ధ్వజస్తంభం దగ్గర, ప్రాంగణాల్లో రాళ్లతో చేసిన దీపస్తంభాలు ఏర్పాటుచేసి వెలిగించేవారు. కాలం గడుస్తున్న కొద్దీ రాళ్లతో చేసిన దీపారాధనలు ప్రజల్లో తగ్గుముఖం పట్టాయి.

\- పెరంబూర్, ఆంధ్రజ్యోతి

పెరిగిన రాతి కుందెనల వినియోగం...

కొంతకాలంగా మళ్లీ రాళ్లతో చేసిన కుందెనలు, దీపస్తంభాల వాడకం పెరుగుతోంది. ముఖ్యంగా, పెద్ద పెద్ద కంపెనీలు, వాణిజ్య కేంద్రాలు, హోటళ్లు తమ భవనాల ముఖభాగంలో అలంకరణ, పూజల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన రాతి కుందెనల్ని ఏర్పాటు చేస్తున్నాయి. అలాగే, కార్తీక మాసంలో ప్రజలు చిన్నచిన్న రాతి దీపాలు కొని వినియోగిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఆర్డర్ ఇచ్చి మరీ తయారు చేయిస్తున్నారు.

తయారీ కఠినం...

కోయంబత్తూర్‌లోని సంగనూరులో రాతి కుందెనలు తయారు చేస్తున్న మహేశ్వరన్ మాట్లాడుతూ... "రాతి దీపాల తయారీ ఒక కళ. నా తండ్రి నుంచి నేను కుందెనల తయారీ నేర్చుకున్నా. కుందెన కింది భాగంలో పీఠం, దానిపై గునపం లాంటి భాగం, దానిపై ప్లేట్, చివరన కిరీటం ఆకారంలో దీపం తదితరాలు అమర్చుతుంటాం. వీటిని విడివిడిగా తయారచేసిన తర్వాత ఒకటిగా కలుపుతాం. ఊత్తుకులి, వారికోట, ఇడయాంపాళయం తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన రాళ్లను యంత్రాలపై చక్కగా రూపొందిస్తాం. పెద్ద రాయి నుంచి రాళ్లు విడదీయడం శ్రమతో కూడుకున్న పని. ఒక రాతి దీపం తయారీకి కనిష్ఠంగా రెండు రోజులు పడుతుంది" అని వివరించారు.


కొత్త డిజైన్‌లో కుందెన

పొరుగు రాష్ట్రాలకు కూడా...

ఇతర ప్రాంతాల నుంచి కూడా ఈ రాతి కుందెనలకు ఆర్డర్లు వస్తున్నట్లు వివరించారు. "కోయంబత్తూర్ మాత్రమే కాకుండా హైదరాబాద్, కేరళ, కర్ణాటక, చెన్నై తదితర ప్రాంతాల్లోనూ రాతి దీపాల వినియోగం పెరగడంతో ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం. ప్రజలు గరిష్ఠంగా ఒక అడుగు, రెండున్నర అడుగుల దీపాలు కొనుగోలుకు ఆర్డర్లు ఇస్తున్నారు. రాతి దీపాలు వెలిగించడం ద్వారా ఇంట్లోని కష్టాలు తొలిగి, కంటి దిష్టి మాయమై జీవితం ఆనందమయంగా ఉంటుందని ప్రజల నమ్మకం. రాతి దీపంలో నూనె పోసేలా పెద్దవి, చిన్న గుంతలు వేర్వేరుగా తయారు చేస్తుంటాం. కార్తీక మాసాల్లో రాతి దీపాలకు మంచి గిరాకీ ఉంటుంది. అప్పుడే మరిన్ని ఆర్డర్లు వస్తుంటాయి. మాలాంటి తయారీదారుల వద్ద పూంపుహార్ లాంటి విక్రయ సంస్థలు రాతి దీపాలు కొనుగులు చేస్తే ఆర్థికంగా చేయూత ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం సహకరించాలి" అంటూ విజ్ఞప్తి చేశారు మహేశ్వరన్.

పన్నెండున్నర అడుగుల ఎత్తు వరకు...

"అడుగు, రెండున్నర అడుగులు, మూడున్నర, ఐదున్నర, పదిన్నర నుంచి పన్నెండున్నర అడుగుల ఎత్తైన రాతి కుందెనలు తయారు చేస్తుంటాం. అడుగుకు ఒక ప్లేటు, రెండున్నర, మూడు అడుగులకు మూడు ప్లేట్లు, ఐదున్నర అడుగులకు ఐదు ప్లేట్లు, పదిన్నర అడుగులకు 7 ప్లేట్లు ఉంటాయి. సాధారణంగా చిన్న రాతి కుందెన బరువు 60 కిలోలు ఉంటుంది. ఎత్తు పెరిగే కొద్దీ బరువు కూడా పెరుగుతుంది. గతంలో చాలా వరకు ఆలయ పాలక వర్గం తరఫున కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ప్రజలు తమ ఇళ్లలో, వాణిజ్య కేంద్రాల్లో ఉంచడానికి కూడా రాతి దీపాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. కోయంబత్తూర్‌లోని సంగనూరు, సుందరపురం, కరమడై తదితర ప్రాంతాల్లో రాతి దీపాల తయారీ కేంద్రాలున్నాయి. కోయంబత్తూర్ జిల్లాలో కూడా రాతి దీపాలు వినియోగం అధికంగా ఉంది. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో మేము తయారు చేసిన రాతి దీపాలే అధికంగా వినియోగిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆర్డర్లు ఇచ్చినా మేము తయారుచేసి అందిస్తాము" అంటూ తమ వ్యాపారం గురించి వివరించారు మహేశ్వరన్.

అట్టహాసంగా రాజరాజచోళుడి సదయ వేడుకలు ప్రారంభం

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంజావూరు బృహదీశ్వరాలయంలో చోళ మహా చక్రవర్తి రాజరాజచోళుడి 1039వ సదయ (శతభిషం) వేడుకలు శనివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు రెండు రోజులుపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రపంచ వారసత్వ చిహ్నంగా ఉంటున్న బృహదీశ్వరాలయాన్ని నిర్మించి తమిళుల కీర్తిని దశదిశలా ఎలుగెత్తి చాటిన చక్రవర్తి రాజరాజచోళుడు తమిళ మాసమైన ఐప్పసి సదయ (శతభిషం) నక్షత్ర దినాన జన్మించారు. అదే విధంగా తన జన్మ నక్షత్ర రోజునే పట్టాభిషిక్తుడయ్యాడు. దీంతో యేటా సదయ వేడుకల పేరుతో రాజరాజచోళుడి జన్మదిన వేడుకలను, పట్టాభిషేక మహోత్సవాన్ని తంజావూరు జిల్లావాసులంతా ఘనంగా జరుపుకోవటం ఆనవాయితీ. ఈ యేడాది 1039వ సదయ వేడుకలు తంజావూరు బృహదీశ్వరాలయం వద్ద శనివారం ఉదయం మంగళవాయిద్యాల నడుమ, వేదపండితుల మంత్రోచ్చాటనల నడుమ ప్రారంభమయ్యాయి. అప్పర్‌పేరవై తరఫున తిరుమురై ఆలాపన, సదస్సులు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజమహల్ దేవస్థానం ట్రస్టీ బాజా రాజా భోంస్లే, జిల్లా ఎస్పీ ఆశీర్వాద్, దక్షిణ ప్రాంతీయ సాంస్కృతిక మండలి సంచాలకుడు గోపాలకృష్ణన్, మాజీ ఎమ్మెల్యే రామచంద్రన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇరైవన్, ప్రొఫెసర్ శివసామి, పళని ఆదీనం గురుమహా సన్నిధానం సాధు షణ్ముగ అడగళార్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రాచీన వాద్య పరికరాలతో 1039 మంది కళాకారులతో నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజరాజచోళుడి సదయ వేడుకలు ఆదివారం ఉదయం జరుగుతాయి. జిల్లా కలెక్టర్ పి. ప్రియంకా పంకజం రాజరాజచోళుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా రాజరాజచోళుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత పెరువుడయార్ (బృహదీశ్వరాలయంలోని మహాలింగం)కు 48 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. రాష్ట్రమంత్రులు కూడా ఈ వేడుకల్లో పాల్గొనున్నారు. చివరగా వివిధ శాఖలకు చెందిన పండితులకు రాజరాజచోళుడి అవార్డులను ప్రదానం చేయనున్నారు.


రాజరాజచోళుడి విగ్రహం.. చోళచక్రవర్తి కీర్తి ప్రతిష్ఠతలను తెలిపే కీర్తనలను ఆలపిస్తున్న ఓదువార్లు, శైవ పండితులు


బృహదీశ్వరాలయం వద్ద సదయ వేడుకల కోసం నిర్మించిన భారీ పందిరి



జీఆర్టీ హోటల్‌లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుకలు

అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ నక్షత్ర హోటళ్లలో ఒకటైన జీఆర్టీ హోటల్‌లో క్రిస్మక్ కేక్ మిక్సింగ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో జీఆర్టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సీఈవో విక్రమ్ కోటా, సెలెబ్రిటీ చెఫ్ దాము, హోటల్ చెఫ్‌లు, సిబ్బంది, పలువురు సెలెబ్రిటీలు పాల్గొన్నారు. ఎకో ఫ్రెండ్లీ ట్రీ లైటింగ్‌తో ఆహ్లాదకరమైన వాతావారణంలో ఈ వేడుకలను నిర్వహించారు. కేక్ మిక్సింగ్ పండుగ స్ఫూర్తికి స్థిరమైన చిహ్నంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కేక్ మిక్సింగ్‌లో డ్రై ఫ్రూట్స్ సుగంధ ద్రవ్యాలు, వైన్, గింజలను ఉపయోగించారు. దీనిపై హోటల్ జనరల్ మేనేజర్ మోనిదీప్ జాస్ మాట్లాడుతూ... తమ హోటల్‌లో ఈ యేడాది క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుకలను సంప్రదాయబద్ధంగా ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. పండుగ ఆచారాలను, పర్యావరణ స్పృహను మిళితం చేయడం ద్వారా ఈ వేడుకలు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగాయన్నారు. ఇపుడు క్రిస్మస్ పండుగ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు.

'ఎత్తనై కాలం దాన్' షార్ట్ ఫిల్మ్‌కు మొదటి బహుమతి



అడయార్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యూ ఏజ్ నైబర్‌హుడ్ డిస్కవరీ, కనెక్టివిటీ ప్లాట్‌ఫాం 'నో యువర్ నైబర్‌హుడ్' (కేవైఎన్).. 'టేక్ వన్ షార్ట్ ఫిల్మ్ కంటెస్ట్' పేరుతో లఘు చిత్రాల పోటీలను నిర్వహించింది. ఇందులో చెన్నైకి చెందిన బి.విఘ్నేష్ కుమార్ రూపొందించిన 'ఎత్తనై కాలం దాన్' అనే షార్ట్ ఫిల్మ్‌కు మొదటి బహుమతి వరించింది. దీంతో ఆయనకు లక్ష రూపాయల నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. అలాగే, రెండో బహుమతి సలావుద్దీన్ సాతు రూపొందించిన 'మా'కు వరించగా, రూ.75 వేల నగదు బహుమతిని, మూడో బహుమతిగా రామ్ గౌతమ్ రూపొందించిన 'ఒరు మెలియాసన కొడు' ఎంపికైంది. రూ.50 వేల నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ పోటీల్లో దాదాపు 500కి పైగా షార్ట్ ఫిల్మ్‌లను సమర్పించగా, వీటిలో 45 ఎంట్రీలను షార్ట్‌లిస్ట్ చేశారు. వీటిలో మొదటి మూడు ఎంట్రీలను న్యాయనిర్ణేతలుగా పాల్గొన్న సినీ ప్రముఖులు గౌతం మీనన్, పుష్కర్ - గాయత్రి జంట, నిర్మాతలు వైనాట్ శశికాంత్, సమీర్ భరత్ రామ్‌తో కూడిన బృందం ఎంపిక చేసిందని కేవైఎన్ సీఈవో గాయత్రి త్యాగరాజన్ పేర్కొన్నారు.

గ్లోబల్ సైబర్ యూనివర్శిటీతో హిందుస్థాన్ వర్శిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న గ్లోబల్ సైబర్ యూనివర్శిటీ గోంగ్ బయోంగ్ యోంగ్, హిందుస్థాన్ వర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ తదితరులు

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాణ్యమైన విద్యనందించడంలో పేరు ప్రఖ్యాతులు గడించిన హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ దక్షిణ కొరియా సియోల్‌లోని గ్లోబల్ సైబర్ యూనివర్శిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సియోల్ నగరంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఒప్పంద పత్రాలపై గ్లోబల్ సైబర్ యూనివర్శిటీ ప్రెసిడెంట్ గోంగ్ బయోంగ్ యోంగ్, హిందుస్థాన్ వర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ జేకబ్ వర్గీస్ మాట్లాడుతూ... మేథోపరమైన విద్య, ధాన్య సంబంధిత కోర్సులను రెండు విశ్వవిద్యాలయాలు సమష్టిగా నిర్వహించనున్నాయన్నారు. అంతేకాకుండా భారతదేశంలో త్వరలో మేధోపరమైన విద్యాకేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో కూడిన ఈ ఒప్పందం మేరకు రెండు విశ్వవిద్యాలయాల నడుమ సాంస్కృతికపరమైన అంశాలపై ఉమ్మడి అధ్యయనం జరుగుతుందని చెప్పారు.

వాళైమానగర్‌లో రూ.93.25 లక్షలతో ఇండోర్ స్టేడియం

- ప్రారంభించిన మేయర్ ప్రియ

చెన్నై, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువిక నగర్ జోన్ 74వ వార్డు పరిధిలో ఉన్న మాళైమానగర్‌లో రూ.93.25 లక్షల వ్యయంతో నిర్మించిన వాలీబాల్ ఇండోర్ స్టేడియాన్ని శనివారం ఉదయం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియారాజన్ ప్రారంభించారు. మేయర్ అభివృద్ధి నిధులతో ఈ ఇండోర్ స్టేడియంను నిర్మించినట్లు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. ఇదే విధంగా 74వ వార్డు కౌన్సిలర్ అభివృద్ధి నిధులతో ఏకాంకిపురంలో రూ.40లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ బిల్డింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తిరువిక నగర్ శాసనసభ్యుడు తాయగం కవి, జోనల్ కమిటీ ఛైర్‌పర్సన్ సరితా మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇండోర్‌స్టేడియంను ప్రారంభిస్తున్న మేయర్ ఆర్. ప్రియారాజన్

అధ్యక్ష పదవికి ఎన్.మురళి రాజీనామా చేయాలి

- నిర్మాత కేఆర్ డిమాండ్



చిత్రపరిశ్రమకు ఏదేని మేలు చేయాలన్న తలంపు ఉంటే ప్రస్తుతం తమిళనాడు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడిగా ఉన్న మురళి రామస్వామి తక్షణం ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలని తమిళనాడు చలన చిత్ర నిర్మాతల మండలి మాజీ అధ్యక్షుడు, సీనియర్ నిర్మాత కేఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన వ్యక్తిగత సమస్యల నుంచి తప్పించుకునేందుకు అధ్యక్ష పదవిని మురళి ఒక రక్షణ కవచంలా ఉపయోగించుకుంటూ అమాయకుడిలా నటించడాన్ని సహించలేమన్నారు. తాను నిర్మాతల మండలికి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రూ.11 కోట్ల డిపాజిట్లు ఉండేవని, ఆ తర్వాత హీరో విశాల్ సారథ్యంలో కోశాధికారిగా ఉన్న నిర్మాత ఎస్ఆర్ ప్రభు ఈ నిధులను సభ్యుల సంక్షేమం కోసం ఖర్చు చేసి చిల్లిగవ్వ లేకుండా చేశారన్నారు. నిధుల దుర్వినియోగంపై ఇప్పటివరకు ఏ ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయలేదన్నారు. చిత్రపరిశ్రమకు మేలు చేసిన ముఖ్యమంత్రుల్లో కలైంజర్ కరుణానిధి ముందు వరుసలో ఉంటారన్నారు. అలాంటి మహానేత 'కలైంజర్-100' పేరుతో నిర్వహించిన శతజయంతి వేడులకను కూడా నిర్మాతల మండలి సంక్రమంగా నిర్వహించ లేక పోయిందన్నారు. ఈ కార్యక్రమం కోసం ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరితే ఇప్పటివరకు స్పందన లేదన్నారు. అంతేకాకుండా, నటీనటులకు వ్యతిరేకంగా రెడ్‌కార్డులు చూపించడం, కొత్త సినిమాల షూటింగుల ప్రారంభోత్సవాలను నిలిపివేయడం వంటి నిర్ణయాలను అన్ని క్రాఫ్ట్‌లతో చర్చించి తీసుకోవాల్సి ఉండగా, షూటింగుల బంద్‌పై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్ల చిత్రపరిశ్రమతో పాటు సినీ నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే చిత్రపరిశ్రమ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే, ధనుష్ వంటి హీరోలకు రెడ్‌కార్డు చూపించడం, షూటింగుల బంద్, కొత్త చిత్రాల ప్రారంభోత్సవాల నిలిపివేత వంటి చర్యలు మరింత హాని చేయడమే కాకుండా మోనోపొలిస్ అండ్ రెస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎంఆర్‌టీపీ)కి వ్యతిరేకమని కేఆర్ పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

స్టేజ్ డ్యాన్సర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు

సీఎంకు సంఘం వినతి


స్టేజ్ డ్యాన్సర్ల సర్వసభ్య సమావేశంలో నిర్వాహకులు

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు తమిళనాడు స్టేజ్ డ్యాన్సర్ల (కళాకారుల) మున్నేట్ర సంఘం సర్వసభ్య సమావేశం పలు విజ్ఞప్తులు చేసింది. ఈ మేరకు స్థానిక వడపళనిలోని శిఖరం హాలులో జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో మొత్తం 11 అంశాలపై తీర్మానం చేశారు. వీటిని సీఎం స్టాలిన్ పెద్ద మనసుతో పరిష్కరించాలని కోరారు. ఈ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు పి.ప్రేమానంద్ నేతృత్వంలో జరిగింది. ఇందులో సంఘ సభ్యులు, నటుడు రోబోశంకర్, ప్రియాంక రోబో శంకర్, ముత్తుకాళై, కింగ్‌కాంగ్, సారపాంబు సుబ్బురాజ్, బావా లక్ష్మణన్, జూలీ భాస్కర్, సాయి గోపి, చంద్రబాబు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. 11 తీర్మాలను అధ్యక్షుడు ప్రేమానంద్ వెల్లడించారు. స్టేజ్ డ్యాన్సర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, సంఘ సభ్యుడు అకాల మరణం చెందితే ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని, సీనియర్ కళాకారులకు నెలకు రూ.2వేలు ఆర్థిక సాయం చేయాలని,కళాకారులు కార్యక్రమాలకు కోసం వెళ్లి వచ్చేందుకు 50శాతం రాయితీతో బస్సు పాస్‌లు అందజేయాలని, చెన్నైలో ఉచిత సిటీ బస్ పాసులను జారీ చేయాలని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదనీ, వీటికి అనుమతులు ఇచ్చేలా సీఎం పోలీస్ శాఖను ఆదేశించాలని, విల్లుపురం జిల్లాలో స్టేజ్ డ్యాన్స్ ప్రోగ్రాంలపై విధించిన నిషేధాన్ని తొలగించాలని, స్టార్‌నైట్ 2025కు ముఖ్య అతిథిగా సీఎం హాజరుకావాలంటూ తీర్మానాలు చేయగా, వీటిపై సానుకూలంగా సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'రెయిన్‌బో' ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంట్రీల ఆహ్వానం



'రెయిన్‌బో' ఫిల్మ్ ఫెస్టివల్ లోగో

చెన్నై మహానగరంలో రెయిన్‌బో (వానవిల్) ఫిల్మ్ ఫెస్టివల్ నాలుగో ఎడిషన్ త్వరలో జరగనుంది. ఇందులో ప్రదర్శించే చిత్రాల ఎంట్రీలను డిసెంబరు 15వ తేదీలోపు పంపించాలని నిర్వాహకులు కోరారు. గతంలో మూడు చిత్రోత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఇందులో ఎల్జీబీటీక్యూఐఏ ప్లస్ వ్యక్తుల జీవితాలను, వారు ఎదుర్కొంటున్న సవాళ్ళు, సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ తెరకెక్కించిన షార్ట్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు, ఫీచర్ ఫిల్మ్‌లను ప్రదర్శించడానికి వేదికగా ఇది పేరుగాంచింది. ఇప్పటివరకు జరిగిన మూడు ఎడిషన్లలో దాదాపు 300కుపైగా చిత్రాలను ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో నాలుగో ఎడిషన్ రెయిన్‌బో ఫిల్మ్ ఫెస్టివల్ కోసం ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఇందులో తమ చిత్రాలను ప్రదర్శించాలని భావించే నిర్మాతలు డిసెంబరు 15వ తేదీలోపు ఎంట్రీలను పంపాల్సి ఉంటుంది. ఈ చిత్రోత్సవాల ముగింపు వేడుకల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను ప్రదానం చేయనున్నారు.

కోలీవుడ్‌కు మరో కొత్త హీరోయిన్!


కయదు లోహర్

'లవ్‌టుడే' ఫేం ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డ్రాగన్' ద్వారా తమిళ చిత్రపరిశ్రమకు మరో కొత్త హీరోయిన్ పరిచయమవుతున్నారు కయదు లోహర్. తెలుగు, కన్నడ, మలయాళం భాషా చిత్రాల్లో ఇప్పటికే ఎంట్రీ ఇచ్చి తన అందచందాలను ఆరబోసిన ఈమె.. తమిళంలో మంచి కథా చిత్రంలో నటించి ఎంట్రీ ఇవ్వాలన్న పట్టుదలతో ఉన్నారు. ఆమె కోరిక ఫలించడంతో ప్రదీప్ రంగనాథ్ చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నారు. ఈ విషయాన్ని మూవీ మేకర్స్ అధికారికంగా వెల్లడించింది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే ఒక హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్‌ను ఎంపిక చేయగా, తాజాగా రెండో హీరోయిన్‌గా కయదు లోహర్‌ను ఎంపిక చేశారు. ఏజీఎస్ నిర్మాణ సంస్థ నిర్మించే ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం. వచ్చే యేడాది ప్రేక్షకుల ముందుకురానున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది.

విమానాశ్రయంలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసు బృందాలు

రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం శనివారం తెల్లవారుజామున 1.30గంటలకు ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలోకి ప్రయాణికుల ముసుగులో తీవ్రవాదులు ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై డ్రిల్ చేశారు. అదే సమయంలో విస్ఫోటనాలు జరిగితే ప్రాణనష్ట నివారణకు తీసుకోవాల్సిన అంశాలపైనా మాక్‌డ్రిల్ చేశారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణబాబు, సీఐ రాంబాబు, సీఐఎస్ఎఫ్ కమాండంట్ శుక్ల, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 64,983 మంది భక్తులు దర్శించుకున్నారు. 25,324 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో హీరో నిఖిల్...



సినీ యువ హీరో నిఖిల్ శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన నిఖిల్‌ను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కళ్యాణ వైభోగమే

ఆకాశం దిగివచ్చి మబ్బులతో వెయ్యాలి మన పందిరి..ఊరంతా చెప్పుకునే ముచ్చటగా సాగాలి పెళ్లంటే మరి..

అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినిమాపాటలో. ఎవరెన్ని చెప్పినా పెళ్లంటే సందడికి ప్రత్యామ్నాయమే. అందుకే పెళ్లి అనగానే ఎంత హడావుడి పడుతుంటారో. ఇదంతా ఒక సంగతయితే కొన్ని రోజులుగా పెళ్లి సందడి కనిపించడం లేదు. కారణం ముహూర్తాలు లేకపోవడమే. మూడు నెలలపాటు మూఢం రావడంతో శుభ కార్యాలయాలకు సెంటిమెంటు అడ్డొచ్చింది. ఆశ్వయుజ మాసంలో కొన్ని ముహూర్తాలున్నా చాలామంది దీపావళి తర్వాత వచ్చే కార్తీకమాసం ముహూర్తాలపైనే ఆసక్తి చూపుతున్నారు. మార్గశిర మాసంలో కూడా మంచి బలమైన ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో వధూవరుల తల్లిదండ్రులు ఈ రెండు నెలల ముహూర్తాల్లోనే వివాహం చేయాలని సిద్ధపడుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



మోగనున్న పెళ్లి భాజాలు

ఈ రెండు నెలల్లో ఎక్కువ శుభ ముహూర్తాలు

ఇప్పటికే బుక్ అయిన కళ్యాణ మండపాలు

పురోహితుల నుంచి ఫొటోగ్రాఫర్ల వరకూ డిమాండ్

ఇప్పుడు కాకుంటే మాఘం వరకూ ఆగాల్సిందే..

పెళ్లిళ్లకే కాదు వివిధ ఉపనయనాలు, గృహ ప్రవేశాలు లాంటి శుభ కార్యక్రమాలకూ ఈనెల 10 నుంచి 28వరకూ, అలాగే డిసెంబరు 4 నుంచి 16వ తేదీ వరకు అంటే సుముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాల తర్వాత మాఘమాసం వరకూ ఆగాల్సిందే. అందుకే అందరూ త్వరపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూఢంలో ముహూర్తాలు లేక దిగాలు పడిన వారందరిలో ఇప్పుడు జోష్ కనిపిస్తోంది. వివాహ సంబంధ వ్యవహారాలతో ముడిపడినవారంతా బిజీబిజీగా కనిపిస్తున్నారు. కళ్యాణ వేదికలకు చాలా డిమాండ్ ఏర్పడింది. ఈమధ్యనే పెళ్లి కుదుర్చుకున్న వారు వేదిక దొరక్క దూరంగా వెళ్లయినా చేయాలకుకుంటున్నారు.

అందరూ బిజీబిజీ

గతంలో పెళ్లంటే హంగూ ఆర్భాటం ఉండేది కాదు. ఇప్పుడు అన్ని వర్గాలవారూ వివాహం అందరూ గుర్తుంచుకునేలా చేయాలని ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ఎంతయినా వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు,భాజా భజంత్రీలవారు,కేటరింగ్, బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, షామియానా,కుర్చీలు సప్లయర్స్, ఆకర్షణీయ డెకరేటర్లు ఒకరేమిటి ఇలా చాలా మంది వెంటపడాల్సి వస్తోంది. ఈ శ్రమ లేకుండా తామే అన్ని చూసుకుంటామంటూ ఈవెంట్ మేనేజర్లు పుట్టుకొచ్చారు. శుభ కార్యక్రమాలకు దివ్యమైన ముహూర్తాలు దగ్గర పడుతుండటంతో వీరందరికీ గిరాకీ ఏర్పడింది. రానున్న ముహూర్తాల్లో దాదాపు 10వేలకు పైగా పెళ్ళిళ్లు జరగనున్నాయని అంచనా.

తిరుపతిలో కళ్యాణ మండపాలకు డిమాండ్

తిరుపతిలో పెళ్లి చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి కనపరుస్తున్నారు. ఇప్పటికే టీటీడీ కళ్యాణ మండపాలతో పాటు ప్రయివేటు, కార్పొరేట్, చిన్నా చితకా మండపాలు, మాల్స్ అన్నీ బుక్ అయిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని మండపాల నిర్వాహకులు పెళ్ళి చేసే వారికి ఇబ్బంది లేకుండా కేటరింగ్, బ్యాండు మేళాలు, భోజనాలు, డెకరేషన్, పురోహితులు, ఇలా సర్వం ప్యాకేజీ రూపంలో ఏర్పాటు చేస్తున్నారు. మండపాల స్థాయిని బట్టి రూ.60 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మరోపక్క బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో సందడి సందడిగా కనిపిస్తున్నాయి. బట్టల షాపులూ రద్దీగానే ఉన్నాయి. నాణ్యత, మన్నికలను బట్టి పట్టుచీరలకు రేట్లు వసూలు చేస్తున్నారు. కనీసం రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకు పట్టుచీరల ధరలు పలుకుతున్నాయి.

శుభ ముహూర్తాలు ఇవీ....

ఈనెల నుంచి మార్చి వరకు వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలున్నాయి.

ఈ నెలలో 10,14,16,17,20,22,27,28 తేదీలు

డిసెంబరు: 4,5,6,7,8,11,12,14,15,19,20,21,26,27,28

జనవరి : 31వ తేదీ మాత్రమే

ఫిబ్రవరి: 2,6,7,8,9,12,13,14,15,16,21,22,23,26

మార్చి: 2,6,9,12,15,16.

వివాహాలకు అనుకూలం

నవంబరు, డిసెంబరు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. భాద్రపద మాసంలో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.. డిసెంబరు నెలాఖరు వరకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే విశేష ముహూర్తాలకు అంత బలం.

-సత్యనారాయణ మూర్తి, పురోహితులు

ధరలతో ఆందోళన

ఐదారు సంవత్సరాలతో పోలిస్తే క్యాటరింగ్ సంస్థలు పెరిగాయి. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, ఆయిల్, బియ్యం, పప్పుల ధరలు దారుణంగా ఉన్నాయి. గతంలో ధరలకు భోజనం సమకూర్చాలంటే కష్టమే. ఇదే భయం మమ్మల్ని వెంటాడుతోంది. ఎలా ఉన్నా ఈ రెండు నెలలూ క్యాటరింగ్ నిర్వాహకులకు చేతినిండా పని ఉంటుంది

-కృష్ణమూర్తి, ఎస్‌కే క్యాటరింగ్, తిరుపతి

ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నబాబు



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వనపాకం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చిన్నబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్ జనరల్ సెక్రటరీగా శంకరప్ప, జాయింట్ సెక్రటరీగా రెహానా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సమస్యలను ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం



వీరాంజనేయులు (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. బాపట్లకు చెందిన ముత్యాల వీరాంజనేయులు(50) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. బాపట్ల జిల్లాకు చెందిన అతని స్నేహితులు రంగారావు(52), గంధం కృష్ణమూర్తి(53)తో కలిసి కారులో బెంగళూరుకు శుక్రవారం బయలుదేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై ఓ లారీ మరమ్మతులకు గురికావడంతో రోడ్డుపక్కన నిలిపివేశారు. శనివారం వేకువజామున 2గంటల ప్రాంతంలో బెంగళూరు వైపుగా వెళుతున్న వీరి కారు ఆగివున్న లారీని ఢీకొంది. వాహనం నడుపుతున్న వీరాంజనేయులు, రంగారావు, కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరాంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీఎఫ్ నిధులు స్వాహా

మ్యాన్ పవర్ ఏజెన్సీపై కార్మికుల ఫిర్యాదు

సత్యవేడు, నవంబరు 9: కార్మికులు కాయ కష్టం చేసి దాచుకున్న పీఎఫ్ సొమ్మును ఓ మ్యాన్ పవర్ ఏజెన్సీ స్వాహా చేసింది. దీంతో కార్మికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శ్రీసిటీ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీసిటీ పరిధిలోని ఐఎఫ్ఎఫ్ పరిశ్రమలో కొంత మంది కార్మికులు తమిళనాడుకు చెందిన వీపీజీ అనే మ్యాన్ పవర్ ఏజెన్సీ కింద పని చేస్తున్నారు. తమ వేతనం డబ్బుల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్ నగదును దిగమింగేశారని పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు శనివారం శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023కు సంబంధించిన పీఎఫ్ సొమ్ముతో పాటు, తమకు రావాల్సిన బోనస్ నగదును స్వాహా చేసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు రూ.20 లక్షలకు పైగా కార్మికుల పీఎఫ్, బోనస్ డబ్బులు కాజేశారని సమాచారం. ఈ వ్యవహారంలో పరిశ్రమలో కీలక విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు రావాల్సిన పీఎఫ్, బోనస్ నగదును తమ ఖాతాల్లో జమ చేసి న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

పుత్తూరులో నకిలీ నోట్ల కలకలం

- రూ.30 వేల రూ.500 నకిలీనోట్ల చలామణి
- తండ్రీకూతుళ్లు నిందితులు
- పోలీసులకు అప్పగించిన స్థానికులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 09(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో నకిలీ నోట్ల చలామణి కలకలం సృష్టించింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో నకిలీ నోట్ల చలామణి చేస్తున్న తండ్రీకూతుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 వేల వరకు రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పుత్తూరులో బిజీబిజీగా ఉండే బజారు వీధి తదితర ప్రాంతాల్లోని చిల్లర దుకాణాలే లక్ష్యంగా నకిలీ నోట్ల మార్పునకు వీరు శ్రీకారం చుట్టారు. బాధితుల కథనం మేరకు.. ఓ ఫైనాన్సర్ దుకాణాల నుంచి రోజువారీ ఫైనాన్స్ నగదును కలెక్షన్ చేసుకుని తన వద్ద ఉన్న లెక్కింపు మిషన్‌తో లెక్కించారు. వాటిలో రూ.500 నోట్లు నకిలీవిగా గుర్తించారు. అప్రమత్తమైన ఫైనాన్సర్ సదరు దుకాణదారులకు సమాచారం అందించారు. అప్పటికే పలు దుకాణాలలో దాదాపు రూ.30 వేలకు పైగా రూ.500 నకిలీ నోట్లను తండ్రీ, కూతురు మార్పు చేశారు. రూ.50లకు చిన్నపాటి సరుకులు కొనుగోలు చేసి రూ.450 నగదును తిరిగి పొందేవారని గుర్తించారు. ఫైనాన్సర్ సమాచారంతో దుకాణదారులందరూ ఏకమై వారి కోసం జల్లెడపట్టారు. పుత్తూరు పోలీస్ స్టేషన్ ఎదుట వెళుతున్న వారిని గుర్తించి కానిస్టేబుల్ మురళికి సమాచారం ఇచ్చారు. వారిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులు వద్ద ఉన్న నకిలీ రూ.500ల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తిరుచానూరులో కాపురం ఉన్నట్లు వెల్లడైంది. తిరుపతిలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ నకిలీ నోట్లను పొందినట్లు విచారణలో తేలింది. దీంతో అసలు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సీఐ సురేంద్రనాయుడు వెల్లడించారు.

రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం



మునీంద్ర(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరం గ్రామానికి చెందిన మునీంద్ర(35) ఆటో డ్రైవర్. ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై ఆటోలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మునీంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఊరందూరు వద్ద మృతదేహాన్ని సుమారు మూడు గంటల పాటు అక్కడే ఉంచేశారు. మృతదేహాన్ని తరలించడంలో జాప్యం జరగడంపై ఉన్నతాధికారులు శ్రీకాళహస్తి రూరల్‌పోలీసులను మందలించినట్లు సమాచారం.

ముక్కంటి ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



రమేష్‌రాజు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి చెందిన ఒప్పంద ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. విధులకు అనధికారికంగా గైర్హాజరు అవుతున్నాడని రమేష్‌రాజు అనే ఒప్పంద ఉద్యోగిని అధికారులు నెల రోజుల క్రితం సస్పెండ్ చేశారు. అయితే తనను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు స్పందించడంలేదని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్యూటీ లేక కుటుంబ పోషణ భారం కావడంతో ఆత్మహత్యకు యత్నించినట్లు రమేష్‌రాజు వాపోయాడు.

వెటర్నరీవర్సిటీలో అధ్యాపకుల బదిలీలు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఏపీరాష్ట్రంలో తిరుపతికేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌లో భాగంగా పలువురు ప్రొఫెసర్లు, సైంటిస్టులు, అధ్యాపకులకు బదిలీలు చేపట్టారు. తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ, ప్రొద్దుటూరులోని వెటర్నరీ కాలేజ్, గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, వెంకట్రామన్నగూడెం, విశాఖపట్నం, రామచంద్రాపురం, వెన్నెలవలస, గుంటూరు కేవీకేలో పనిచేసే దాదాపు 26మందిని గిరివిడికి బదిలీ చేస్తూ శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శనివారం పలువురు రిలీవ్ అయినట్లు తెలిసింది.

రేపు జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సు, బయోడేటా ఫాంతో సంబంధిత లింక్‌లో నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డుతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8555972657ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడా రంగానికి పూర్వవైభవం : శాప్ చైర్మన్



పోటీలను తిలకిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శనివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఫస్ట్ ఓపెన్ సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న క్రీడా వేదికలను డీఎస్ఏ(డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ)ఆధీనంలోకి తేచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2027లో రాష్ట్రంలో నేషనల్స్ గేమ్స్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, తొలి రోజు అండర్ 12 వ్యక్తిగత కట, కుమితే విభాగాలలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ సీనియర్ నాయకులు వూకా విజయకుమార్, మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలు

రేణిగుంట, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17, 19 ఘట్కా క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి విశ్వనాథ్‌నాయక్, స్టేట్ పర్యవేక్షణ అధికారి బాలశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు, 30 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. అందరికీ భోజన వసతి కల్పిస్తున్నట్లు హెచ్‌ఎం విష్ణువర్ధని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఘట్కా కార్యదర్శి సురేంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రేఖరాణి తదితరులు పాల్గొన్నారు.



ఘట్కా పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

మా భూములు మాకు అప్పగించండి



కళత్తూరులో టవర్ ఎక్కిన దళిత రైతులు

- టవర్ ఎక్కిన కళత్తూరు దళిత రైతులు



గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

కేవీబీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూముల్లోకి వెళ్లకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారంటూ మండలంలోని కళత్తూరు దళిత రైతులు శనివారం ఉదయం సెల్ టవర్ ఎక్కారు. వారు మాట్లాడుతూ కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెంబరు.4లోని భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పది సంవత్సరాల నుంచి అటవీ, రెవెన్యూ అధికారులు ఈ భూములు తమవంటే తమవంటూ అడ్డంకులు కల్పిస్తున్నారన్నారు. రెవెన్యూ వారు ఏకంగా ఆ భూముల్లో కొంతమందికి పట్టాలు సైతం ఇచ్చారని తెలిపారు. ఇటీవల ఆ భూముల్లోకి ప్రవేశించిన రైతులపై అటవీ శాఖ వారు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసేవరకు దిగేది లేదని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి తహసీల్దారు భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను కిందకు దించడానికి ప్రయత్నించారు. వారు ససేమిరా అనడంతో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశ్వర్లు వంద రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో దిగి వచ్చారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను ఎవరూ అడ్డుకోరని చెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దారు మునిరత్నంరెడ్డి, పోలీసు సిబ్బంది అమరనాథనాయుడు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.